జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 6 | అక్టోబర్ | 2025 • పేజీలు : 5

# ఇల్లందులో పర్యటించిన డైరెక్టర్



**ఇల్లందు, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు పర్యటించారు. ముందుగా ఇల్లందు జియం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జెకె ఓసిని త్వరలో ప్రారంబించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, దానికి ఉన్న అడ్డంకులు అన్ని తొలగించడానికి కావాల్సిన పనులను అందించడానికి సింగరేణి అధికారులు, ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలందరూ సహకరించి నూతన ఓసి ప్రారంభానికి

మిగతా 2 లో...

• బస్టాండ్ వద్ద గుంత సమస్యతో మొదలైన అంశం.. • "జాగ్రత్త'' అంటూ మాట్లాడిన కమ్యూనిస్టు నేత ఫోన్ కాల్ వైరల్ • చిన్న గుంత విషయం నుంచి పెద్ద రాజకీయ వివాదం దాకా! • ప్రజా సమస్య రాసిన రిపోర్టర్ పై కమ్యూనిస్టు నేతల బెదిరింపులు • రిపోర్టర్ మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యాయత్నం.. • స్వేచ్ఛగా వ్రాసే హక్కుకే ముప్పు అంటూ జర్నలిస్టు సంఘాల ఆగ్రహం • "ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి ముప్పు'' — సంఘాల ఖండన

# చిన్న విషయం.. పెద్ద వివాదం...

2 లో..

''ఎందుకులే ప్రజాసామ్య వాదులం కాబట్టి సరిబెడుతున్నాం.. లేకపోతే మా వెంట ఉన్న 200 మంది పోరాగాళ్లకి బాగా చిరాక్ లేస్తుంది ఒక్కొక్కడికి.. ప్రశాంతంగా ఎవరి పనులు వాళ్ళు చేసుకొని బతుకుతున్నాం.. మమ్మల్ని ఎందుకు గెలుకుతున్నారు. ఎక్కువ చేస్తే సన్మానం చేస్తాం.. జాగ్రత్త'' అంటూ ఓ కమ్యూనిస్టు లీడర్ మాట్లాడిన ఫోన్ కాల్ సంభాషణ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక చిన్న గుంత సమస్య తాలుకు వార్త కథనం, సామాజిక మాధ్యమంలో జరిగిన ఓ సంభాషణ వల్ల ఆ నేత ఈ విధంగా మాట్లాడాల్సి వచ్చింది. అయితే ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ, ప్రతి ప్రభుత్వాన్ని విమర్శించే కమ్యూనిస్టులు ఈ చిన్న వ్యతిరేకతపై అంతలా ఎందుకు ప్రతిస్పందించరన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రజాస్వామ్య విలువలు, సామ్యవాద సిద్ధాంతాల కోసం కదిలిన ఆ వర్గం ఇప్పుడు నియోజకవర్గ స్థాయిలో అధికారాన్ని అందుకున్న తర్వాత అదే ప్రజల మనసుల్లో భయాన్ని నింపే దిశగా 'కొత్త కోణం' చూపిస్తోందన్న విమర్శ వినిపిస్తోంది.



• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



# ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారు

పార్టీని పటిష్ట చేయడంలో జిల్లా నాయకత్వం విఫలమవుతుంది

• తోట రాజకీయాలు చేస్తే ప్రజా సమస్యలు తెలుస్తాయా..?
• మేమంతా మాజీలమే.. మాతో పని లేదా..?
• సమన్వయం లేకపోతే సత్తా చూపిస్తాం... మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు

**అశ్వారావుపేట, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు విసిగిపోయి కేసీఆర్ వైపు చూస్తున్నారని, ఇటువంటి సమయంలో పార్టీని పటిష్ట చేయడంలో జిల్లా నాయకత్వం విఫలమవుతుందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే

మిగతా 2 లో...

# మావోయిస్టుల వేటలో మహిళా కమాండోలు



**చర్ల, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లాలోని నక్సల్ ప్రభావిత అంతర్గత ప్రాంతాలలో దుర్గా ఫైటర్స్ మహిళా కమాండోలు తమ ధైర్యం, అంకితభావం అజేయమైన సంకల్పంతో నక్సలిజం నిర్మూలన దిశగా చరిత్ర సృష్టిస్తున్నారు.ఈ మహిళా యోధులు నక్సలైట్లకు వ్యతిరేకంగా విజయవంతమైన ప్రచారాలకు నాయకత్వం వహిస్తున్నారు, డి ఆర్ జి , బస్తర్ ఫైటర్స్ సి ఆర్ పీ ఎఫ్ సిబ్బందితో భుజం భుజం కలిపి పని చేస్తున్నారు. ఒకప్పుడు నక్సలైట్ సంస్థలో తమ బాల్యాన్ని గడిపిన ఈ ధైర్యవంతులైన మహిళలు ఇప్పుడు అదే అడవులలో

మిగతా 2 లో...

## కొత్తగూడెం-ఇల్లందు రోడ్డుకు
# మరమ్మతులు ప్రారంభం

• స్పందించిన ఎమ్మెల్యే కోరం



ప్రజాజ్యోతి ఎఫెక్ట్

**టేకులపల్లి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం–ఇల్లందు నేషనల్ హైవే గుంతల మయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న అంశంపై ప్రజాజ్యోతి దినపత్రిక సెప్టెంబర్ 17న ప్రచురించిన "వామ్మో కొత్తగూడెం–ఇల్లందు రోడ్డు!" అనే కథనానికి స్పందన లభించింది. ఆ కథనాన్ని గమనించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తక్షణమే నేషనల్ హైవే శాఖ అధికారులతో చర్చించి, రోడ్డు మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆదివారం నాడు అధికారులు రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టేకులపల్లి మండల ప్రజలు, ప్రయాణికులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను నిరంతరం ప్రతిపాదిస్తూ వాటి పరిష్కారానికి వేదికగా నిలుస్తున్న ప్రజాజ్యోతి దినపత్రికను ప్రజలు ప్రశంసించారు.

## మావోయిస్టుల వేటలో మహిళా కమాండోలు

(మొదటి పేజీ తరువాయి...)

నక్సలైట్లకు వ్యతిరేకంగా దాడికి నాయకత్వం వహిస్తున్నారు. సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఐపీఎస్) కిరణ్ చవాన్ సమర్థవంతమైన నాయకత్వంలో, సుక్మా జిల్లా నక్సల్స్ రహితంగా మారే దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లాలో దుర్గా ఫైటర్స్ మహిళా కమాండోలు, డిఆర్ జి, బస్తర్ ఫైటర్స్ అదనపు భద్రతా దళాలతో కలిసి భద్రతా శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా నక్సలైట్ల వేటలో కీలక పాత్ర పోషిస్తున్నారు.మా దుర్గా అని పిలువబడే ఈ మహిళా కమాండోలు నక్సలైట్లకు భయానకంగా మారారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన "2025 నాటికి నక్సల్ రహిత భారతదేశం" అనే ప్రతిజ్ఞను సాకారం చేయడంలో సుక్మా జిల్లా ప్రముఖ పాత్ర పోషిస్తోంది. దుర్గా ఫైటర్స్ లోని మహిళా కమాండోలు సైనికుల అవిశ్రాంత కృషికి సుక్మా త్వరలో నక్సల్ రహిత జిల్లాలలో ఒకటిగా మారనుంది అని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## ఇల్లందులో పర్యటించిన డైరెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)



అలాగే ఇల్లందు మనుగడకు సహకరించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధిగమించాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని, అలాగే బొగ్గు నాణ్యత సామర్థ్యం నాణ్యతతో బొగ్గు ఉత్పతి అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఉపరితల గనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు, రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలన్నారు. అనంతరం ఏరియా హాస్పిటల్ ని సందర్శించి, కార్మికులకు ఎలాంటి వైద్యం అందజేస్తున్నారని తెలుసుకున్నారు. నిరంతరం వైద్యులు ఉద్యోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జియం వీసం. కృష్ణయ్య, ఎస్ ఓటూ జియం డి.రామస్వామి, ఏరియా ఇంజనీర్ ఆర్వీ నరసింహరాజు, ఏజియం ఐఈడి గిరిధర్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డీజియం (పర్సనల్) అజీర తుకారాం, రామూర్తి, శివ వీర కుమార్, శివ ప్రసాద్, సతీష్ కుమార్, వెంకటేశం, రత్నం, నాగేశ్వరరావు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు నునావత్ రాంబాబు మృతి బాధాకరం- రమేష్ రాథోడ్.



**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నాగారం పంచాయతీ పరిధిలోని భోజ్యా తండా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నునావత్ రాంబాబు మృతి పట్ల గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ రాథోడ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రాంబాబు తోగ్గూడెం గ్రామ పంచాయతీలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ చివరికి మరణించారు. ఈ సందర్భంగా రమేష్ రాథోడ్ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి, వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులు నునావత్ శంకర్, బిక్షం తదితరులకు ధైర్యం కల్పిస్తూ, రాంబాబు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ శోభన్, రాంబాబు, సేవాలాల్ సేన బానోత్ భరత్, నునావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న విషయం.. పెద్ద వివాదం..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి :** ''ఎందుకులే ప్రజాసామ్య వాదులం కాబట్టి సరిబెడుతున్నాం.. లేకపోతే మా వెంట ఉన్న 200 మంది పోరాగాళ్లకి బాగా చిరాక్ లేస్తుంది ఒక్కొక్కడికి.. ప్రశాంతంగా ఎవరి పనులు వాళ్ళు చేసుకొని బతుకుతున్నాం.. మమ్మల్ని ఎందుకు గెలుకుతున్నారు. ఎక్కువ చేస్తే సన్మానం చేస్తాం.. జాగ్రత్త'' అంటూ ఓ కమ్యూనిస్టు లీడర్ మాట్లాడిన ఫోన్ కాల్ సంభాషణ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒక చిన్నగుంత సమస్య తాలుకు వార్త కథనం, సామాజిక మాధ్యమంలో జరిగిన ఓ సంభాషణ వల్ల ఆ నేత ఈ విధంగా మాట్లాడాల్సి వచ్చింది. అయితే ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ, ప్రతి ప్రభుత్వాన్ని విమర్శించే కమ్యూనిస్టులు ఈ చిన్న వ్యతిరేకతపై అంతలా ఎందుకు ప్రతిస్పందించరన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రజాస్వామ్య విలువలు, సామ్యవాద సిద్ధాంతాల కోసం కదిలిన ఆ వర్గం ఇప్పుడు నియోజకవర్గ స్థాయిలో అధికారాన్ని అందుకున్న తర్వాత అదే ప్రజల మనసుల్లో భయాన్ని నింపే దిశగా 'కొత్త కోణం' చూపిస్తోందన్న విమర్శ వినిపిస్తోంది.

### వివాదం మొదలైంది ఇలా..

ఈ వివాదానికి ఆరంభం కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ వద్ద ఏర్పడిన ఒక సాధారణ గుంతతోనే మొదలైంది. ఆ గుంత వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో, స్థానిక దినపత్రికలో ఓ రిపోర్టర్ చిన్న వార్త రాశాడు. ఆ వార్త సామాజిక మాధ్యమాల్లో షేర్ కావడంతో కొందరు స్థానికులు ఉద్దేశపూర్వకంగానే కమ్యూనిస్టు ఎమ్మెల్యే పనితనంపై విమర్శాత్మకంగా స్పందించారు. స్వార్థ రాజకీయ నేపథ్యంలోనే ఆ వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆగ్రహించిన సీపీఐ జిల్లా కార్యదర్శి, ఆ పత్రిక కొత్తగూడెం ఆర్సీ ఇన్ చార్జికి ఫోన్ చేసి "మీ రిపోర్టర్ జాగ్రత్తగా ఉండమను, మా పోరగాళ్లకి చిరాక్ వస్తుంది" అంటూ మాట్లాడటం పెద్ద వివాదానికి దారి తీసింది. ఆ ఫోన్ కాల్ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల్లో మరింత చర్చ చెలరేగింది. దీనిపై బాధిత రిపోర్టర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని మీడియా వర్గాలు చెబుతున్నాయి. అదే నేపథ్యంలో న్యాయవాదులు, ప్రజాసంఘాలు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సమావేశమై ఈ ఘటనను ఖండించాయి. "స్వేచ్ఛగా వ్రాయగల హక్కు కూడా ఇప్పుడు బెదిరింపుల నీడలోకి వెళ్తుందా?" అని అక్కడ ప్రశ్నించారు. తర్వాత మానసిక ఒత్తిడికి లోనైన ఆ రిపోర్టర్ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సంఘటనను మరింత సీరియస్ గా మార్చింది. ఆయన ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డప్పటికీ, ఈ పరిణామం స్థానికంగా రాజకీయ, సామాజిక చర్చలకు దారితీసింది.

### ప్రస్తుత ఆరోపణలు ఇలా..

ప్రజా సమస్యలపై పోరాటం చెయ్యడంలో కమ్యూనిస్టులకు గొప్ప పేరుంది. కానీ తాజాగా జిల్లా కేంద్రంలో పార్టీకి చెందిన కొంతమంది నేతల ఆగడాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయని కొందరు చెబుతున్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం కదిలిన ఆ వర్గం ఇప్పుడు అదే ప్రజల మనసుల్లో భయాన్ని నింపే దిశగా అడుగులు వేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పార్టీకి చెందిన కొందరి నాయకత్వం ప్రవర్తనతో పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు మాత్రమే కాదు.. జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు కూడా భయపడే పరిస్థితి నెలకొంటోందని వర్గీయులు చెబుతున్నారు. దీంతో ఒకప్పుడు ప్రజల కోసం గళమెత్తిన వారు ఇప్పుడు వ్యక్తిగత ఆధిపత్యం కోసం ప్రవర్తిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ – ప్రజల మధ్య చిన్న వివాదం జరిగినా, అక్కడకు చేరుకుని "పోరాటం" పేరుతో ధర్నాలు చేసి తామే తీర్పులు చెప్పే స్థాయికి చేరుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిజానికి కమ్యూనిస్టు ఉద్యమం సామాజిక సమానత్వం, నైతిక బాధ్యతలతో నడిచింది. కానీ ఇప్పుడు ఆ మార్గం నుంచి దూరమవుతూ స్వప్రయోజనాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. గతంలోనూ వార్తా కథనాలు ప్రచురించిన వారి పట్ల కమ్యూనిస్టు నేతలు ఈ విధంగానే ప్రవర్తించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

### ప్రజా అభిప్రాయాలు ఇలా..

ప్రజా సమస్యను చెప్పినందుకు అవమానానికి గురై, బెదిరింపుల పాలవడం, చివరకు మానసికంగా విరిగిపోవడం.. ఇది ఏకపక్ష పాలనకు సంకేతమని చాలా మంది చెబుతున్నారు. ప్రజల కోసం పోరాడే పార్టీలు కూడా విమర్శలను భరించలేకపోతే, అది ప్రజాస్వామ్యానికి ప్రమాదమే అని అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక సాధారణ వార్తకు ఇంతటి తీవ్రత అవసరమా? ప్రజల గొంతును వినాలి గానీ, నొక్కేయడం ఏంటీ? అనే ప్రశ్నలు జిల్లాలో వ్యాప్తి చెందుతున్నాయి. జిల్లా ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు ఈ పరిణామంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నం ఏ రూపంలోనైనా ప్రజాస్వామ్యానికి నష్టం అని అవి హెచ్చరిస్తున్నాయి.

## ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి...)

తాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ ఒక్క స్థానంతోనే సరిపెట్టుకుందని అంతకుముందు రెండుసార్లు జరిగిన ఎన్నికలలోను ఒక్క స్థానానికే పరిమితమైందన్నారు. తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సన్న, చిన్న కారు రైతులతో సహా ప్రజలందరికీ అభివృద్ధి చేసి చూపిస్తూ ప్రతి గడపకి సంక్షేమాన్ని అందించారని అయినప్పటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క భద్రాచలం మాత్రమే గెలిచామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రెండు సంవత్సరాల పూర్తిగా వస్తున్న నేటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎందుకు అటువంటి వ్యతిరేక ఫలితాలు వచ్చాయన్న సమీక్ష నిర్వహించుకోలేకపోయామన్నారు. 1981లో సర్పంచ్ గా రాజకీయ రంగ ప్రవేశం చేశానని 1987 నుండి 1999 వరకు 12 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వేలేరుపాడు మండలానికి పని చేసే పార్టీని పటిష్టపరిచానన్నారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ కోసం పని చేసే మాలాంటి వాళ్ళని పట్టించుకోకపోతే, సమన్వయం చేసుకోలేకపోతే ఎలా అని జిల్లా నాయకత్వాన్ని ప్రశ్నించారు. 2014లో వైసిపి నుంచి గెలిచానంటే తాటి సత్తా ఏంటో రాష్ట్రానికే తెలిసిందన్నారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ఆయన తోపాటు రాష్ట్రంలో గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్ లో చేరామన్నారు. అధికార పార్టీలో చేరటంతో అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందని, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తుమ్మల నాగేశ్వరరావును మంత్రివర్గంలోకి తీసుకోవడంతో ఆయన సహకారం కూడా తోడవడంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశానన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అవమానించడంతో పార్టీకి రాజీనామా చేశానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు ఫోన్ చేసి పార్టీలో సముచిత స్థానం ఇస్తామని పార్టీలోకి ఆహ్వానించారన్నారు.అప్పటి ముఖ్యమంత్రి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన తను కెసిఆర్ పిలుపుతో మెచ్చా గెలుపుకు కార్యకర్త లాగా కష్టపడి పనిచేశానన్నారు. మేమంతా మాజీలమే అని అయితే మాతో పని లేదా, సమావేశాలకు సమాచారం అందించరా అని ప్రశ్నించారు. తోట రాజకీయాలు చేస్తే ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు . జిల్లా అధ్యక్షులు రేగ నియోజకవర్గ ఇన్చార్జి మెచ్చా నాగేశ్వరావు జిల్లాలో నాయకులు ఎవరిని కలుపుకోకుండా ఒంటెద్దు పోకడలు పోతున్నారన్నారు. మా ఆవేదన అర్థం చేసుకోమని సమన్వయం చేసుకోకపోతే పార్టీ పరంగా ఇబ్బందులు పడతామన్న విషయాన్ని నియోజకవర్గ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు చెబుతున్నామన్నారు. సమన్వయం చేసుకోకపోతే సత్తా చూపిస్తామని బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటామని అవసరమైతే పార్టీ నుండే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. ఎప్పటికైనా జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు నియోజకవర్గం ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ప్రతీ కార్యకర్తను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంకత మల్లికార్జున రావు,మాజీ సర్పంచులు పొట్ట రాజులు,కారం ఎర్రయ్య, భూక్య నాగు, సత్యానారాయణ, లకావత్ వెంకటేశ్వరరావు, జీవన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయం

### కొత్త భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం

**టేకులపల్లి,అక్టోబర్05,ప్రజాజ్యోతి:** గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో ప్రతీ మండల కేంద్రంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. టేకులపల్లి గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ప్రమాద భరితంగా మారింది. ఎప్పుడు కూలుతుందో నని పాఠకులు సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆదేశాల మేరకు టేకులపల్లి గ్రంథ పాలకుడు ఆర్.నాగన్న ఆదివారం ఇల్లందు ఎమ్మెల్య కోరం కనకయ్య ను కలిసి వినతి పత్రం అందజేశారు. టేకులపల్లి గ్రంథాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. నూతన భవనం మంజూరు అయ్యేంతవరకు మండలంలో ఏదైనా భవనం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రంథపాలకుడు తెలిపారు.




# అధ్వానంగా రోడ్డు... ప్రయాణించడం ఎలా?

- చినుకు పడితే చిత్తడే మరమ్మతులకు నోచు కోని రోడు







**టేకులపల్లి, అక్టోబర్05, ప్రజాజ్యోతి:** మండలంలోని పెగల్లపాడు గ్రామపంచాయతీ తూర్పుగూడెం నుండి స్టేషన్ బేతంపుడి వెళ్ళు రోడు అధ్వానంగా ఉండడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు,రోడు గుండా ప్రయాణించే, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మట్టి రోడ్డు ఉండడంతో పాటు రోడ్డు అంతా గుంతలుగా ఏర్పడి ఉంది.దీంతో వర్షం కురిసినప్పుడు ఆ నీరంతా గుంతలో నిండి పోయి ఉండటంతో రోడ్డు అంతా బురదమయంగా మారుతుంది.దీనివల్ల ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు పలు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. టేకులపల్లి వయా పెగళ్లపాడు నుండి బేతంపూడి టూ సుజాతనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతి రోజూ ఉదయం 30నుండి 50వరకు దొంగ ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా రవాణా చేస్తూ అధిక వేగంతో రహదారి గుండా వెళ్లడంతో రహదారి పరిస్థితి మరింత అద్వానంగా తయారయ్యి ద్విచక్ర వాహనదారులు, ప్రయాణించడం చాలా కష్టతరమైంది స్థానికులు ఆరోపిస్తున్నారు.కొన్ని ఏళ్లుగా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రాకపోకలు కష్టంగా మారింది అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.అసలే వర్షాకాలం చినుకు పడితే రోడ్లన్నీ సముద్రాన్ని తలపించే విధంగా రోడు అధ్వానంగా తయారవుతున్నాయి అని వారు ఆరోపించారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు వారు అన్నారు.దీనిపై గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తూర్పుగూడెం, సుజాతనగర్ ప్రధాన రహదారి పై తిరుగుతుండగా రహదారి సైతం దెబ్బతిని గోతులుగా మారినా పట్టించుకునే నాథుడే రువయ్యారు.దీనికి తోడు ఎత్తుపల్లాలుగా మారిన రోడ్లలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురి అయ్యే పరిస్థితి ఏర్పడింది.ఆ రోడుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లన్నీ మరమ్మత్తులు చేసే విధంగా చూడాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## వెంకట్రావుపేట యూత్ ఆధ్వర్యంలో ఆర్మీ యువకుడికి ఘన సన్మానం



**పినపాక, సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి వినయ్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికై విధులు నిర్వహిస్తూ..దసరా పండుగ సందర్భంగా తమ గ్రామానికి రావడంతో గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత మాట్లాడుతూ..గ్రామాల్లోని యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు.యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొప్పుల లక్ష్మణ్,కొప్పుల రామనాథం,మాటూరి నరసింహారావు,పొనగంటి రాంపండు,యర్రాళ్ల నాగరాజు,తోట కృష్ణ,ప్రభాకర్,చిరు, కృష్ణబాబు,తోట ప్రవీణ్,రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధం సిపిఐ

- కౌన్సిల్ సమావేశం ధీమా వ్యక్తం చేసిను గుండె పిన్ని



**జూలూరుపాడు,అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** జూలూరుపాడు మండల వ్యాప్తంగా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతుందని అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేస్తూ నాయకులను కోరారు. ఆదివారం మండల కౌన్సిల్ సమావేశం పొన్నెకంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలములో ప్రజల పక్షాన సిపిఐ నిలబడి పరిష్కారం కోసం పోరాడుతుందని, పార్టీ శ్రేణులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు మండలంలో అన్ని ఎంపీటీసీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని , జెడ్పిటిసి స్థానానికి కూడా పోటీ చేస్తామని తెలిపారు, అంతేకాకుండా కలిసొచ్చే పార్టీల పొత్తుల అవగాహనతో ముందుకు వెళ్తామని , తెలిపారు డిసెంబర్ లో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాల సందర్భంగా ఖమ్మంలో భారీ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు,ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుండె పిన్ని మధు, యాస రోశయ్య, వల మల్ల సామేలు, కిలారి ముత్యాలు, గుడిమెట్ల సీతయ్య, తూము కోటయ్య, చిమట ముత్తయ్య, కంపసాటి నాగేశ్వరరావు, కొండా వీరయ్య బరగడ రమేష్, పాలెపు ప్రభాకర్, చీమకుర్తి సంతోష్, కొండల్ ,AIYF జిల్లా సహాయ కార్యదర్శి sk చాంద్ పాషా పాల్గొన్నారు.

## కిన్నెరసానిలో పర్యాటకు సందడి



**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 05, ప్రజా జ్యోతి:** మండల పరిధిలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది,కిన్నెరసాని జలాశయంలోని పర్యాటక బోటింగ్ సేవల ద్వారా పర్యాటకులు ఆకర్షణగా, దసరా పండగ తరువాత ఆదివారం కావడంతో పర్యటకులు పోటీ తారు,518 మంది సందర్శించగా,27440/- ఆదాయం వచ్చినట్టు కిన్నెరసాని బోర్ట్ యాజమన్యం తెలిపారు.బోటింగ్ సేవలు,పర్యాటకులు సందర్శించాలని బోటింగ్ యాజమాన్యం తెలిపారు.

## ఆర్యవైశ్యుల కష్టాల్లో పాలుపంచుకుంటాం

- జిల్లా ఎక్స్ ఆర్యవైశ్యఅధ్యక్షులు-చారుగుళ్ల



**జూలూరుపాడు,అక్టోబర్ 5( ప్రజా జ్యోతి ):** గత 25 సంవత్సరాల పైగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మరియు ఆర్యవైశ్య సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలలో ముందుంటూ నడిపిస్తున్న చారుగుళ్ల శ్రీనివాస్ , వారు జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం పదవి కాలం ముగిసినప్పటికీ వారి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం హర్షణీయం. అందులో భాగంగా మండల పరిధిలోని గుండేపూడి గ్రామ వాస్తవ్యులు మునగాల సాయి కిరణ్ గారికి, వారు విధులలో చేరేవరకు ప్రతి నెల రూ 1,000 చొప్పున వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ తాజా మాజీ అధ్యక్షులు మరియు వారి టీం ద్వారా ప్రతి నెల అందజేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం లో భాగంగా (33వ) నెల అక్టోబర్ 2025 పెన్షన్ రూ 1,000 వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త కార్యదర్శి మరియాల చంద్రమౌళి గుప్త చేతుల మీదుగా తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షులు మహంకాళి గోపాలకృష్ణ మరియు రాష్ట్ర పొలిటికల్ కో చైర్మన్ వందనపు సత్యానారాయణ మరియు జూలూరుపాడు పట్టణ అధ్యక్షులు శ్రీ ఉడతా వేణు గోపాల రావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి గుప్త గారు మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకపోయినా శ్రీనివాస్ గారు క్రమం తప్పకుండా ప్రతినెల పెన్షన్ ఇవ్వటంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం మాజీ చైర్మన్, కో చైర్మన్ ఉడతా నగేష్ కుమార్, సముద్రాల అనిల్ కుమార్ , జూలూరుపాడు మండల ఆర్యవైశ్య సీనియర్ నాయకులు పెండ్యాల క్రృష్ణమూర్తి, కంచర్ల రామారావు , పెండ్యాల నరేష్, వేముల నాగేశ్వరరావు, కొదుమూరి కరుణాకర్ , అనుమళ్ల శ్రీనివాస రావు మరియు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరామ నూతన కార్యవర్గానికి పెన్షనర్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు

**భద్రాచలం,అక్టోబర్ 5,ప్రజాజ్యోతి :** లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరామ నూతన క్లబ్ అధ్యక్షుడిగా చల్లగుల్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా భూక్య రంజిత్ నాయక్ ఎన్నికైన సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్ .ఎల్ .వి. ప్రసాద్ లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## గ్రామ ప్రజలకు అండగా ఉంటాం

- ఆర్థిక సహాయం చేస్తున్న కొరసా రమేష్.



**జూలూరుపాడు, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని అనంతారం గ్రామంలో మరణిస్తున్న పేద ప్రజల కుటుంబా లకు ఆ గ్రామ కాంగ్రెస్ నాయకుడు కొరసా రమేష్ అండగా ఉంటున్నారు ఆయనతోపాటు ఉసికల వెంకటేశ్వర్లు మల్కం వీరభద్రములు కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా ఉంటూ సహాయం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి కూడా చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నారు పేదవారి సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నారు గ్రామ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ పేద ప్రజలకు అండగా ఉంటున్నారు. సమస్యల ఉన్నచోట తక్షణమే స్పందించి అవసరాన్ని బట్టి సహాయం చేస్తున్నారు గ్రామంలో అనారోగ్యంతో మరణించిన్న పూణ్యం రాధమ్మ కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో నీటి సమస్య వచ్చిన భూమి సమస్య వచ్చిన మనస్పర్థలు ఏర్పడ్డ సమస్యలను సున్నితంగాపరిష్కరిస్తున్నారు.

## ఘనంగా కాక 96వ జయంతి వేడుకలు



**భద్రాచలం టౌన్, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** మాల మహానాడు ఆధ్వర్యంలో గడ్డం వెంకటస్వామి (కాక ) 96వ జయంతి వేడుకలు భద్రాచలంలోని సరోజ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అల్లాడి పౌల్ రాజ్, దామల సత్యం పాల్గొని కేక్ కట్ చేసి వృద్ధులు, వికలాంగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయన లేబర్ మినిస్టర్‌గా కార్మికుల సంక్షేమానికి కృషి చేసి "గుడిసెల వెంకటస్వామి"గా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఆయన వారసులు వివేక్, వినోద్, వంశీ మాలల హక్కుల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహానాడు నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ

- ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య
- పారదర్శకతతో అభ్యర్థుల ఎంపిక – గ్రామ స్థాయిలో పార్టీ బలపర్డమే లక్ష్యం : ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- గ్రామీణ అభివృద్ధికి స్థానిక సంస్థల ఎన్నికలు కీలకం : పొదెం వీరయ్య







**దమ్మపేట, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయదలచిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు ఆదివారం గండుగులపల్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పొదెం వీరయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, టిపిసిసి జనరల్ సెక్రటరీ ధర్మారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుండి పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. పొదెం వీరయ్య మాట్లాడుతూ, "రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ. స్థానిక సంస్థల ఎన్నికలలో మన అభ్యర్థులు గెలవడం ద్వారా గ్రామీణ అభివృద్ధికి పునాదులు వేయగలుగుతాం" అన్నారు.ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, "గాంధీ సిద్ధాంతాలను అవలంబించి ప్రజాసేవ చేసేందుకు సిద్ధమైన అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తోంది. అభ్యర్థుల ఎంపికలో పూర్తిగా పారదర్శకత పాటిస్తాం. గ్రామ, మండల స్థాయిలో కాంగ్రెస్ బలం మరింతగా పెంచడమే మన లక్ష్యం" అని తెలిపారు.అదేవిధంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ, "మహిళా శక్తి కాంగ్రెస్ విజయానికి మూలాధారం. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎక్కువ సంఖ్యలో మహిళలు పోటీ చేయడం పార్టీకి గౌరవం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సేవాదళ్ నాయకులు, సోషల్ మీడియా టీం సభ్యులు, గ్రామ స్థాయి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు".

# అన్నదానానికి రూ 1,01,116లు

- గోదానం కు రూ. 75,510లు వితరణ



**భద్రాచలం, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన పథకానికి హైదరాబాద్ కమలాపూర్ కాలనీకి చెందిన టి.కె. శ్వేత రూ. 1,01,116లు, గోదానం నిమిత్తం రూ.75,510 విరాళంగా అందించారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వారు ముందుగా స్వామివారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం ఈవో కే దామోదర్ రావుకు అన్నదాన నిమిత్తం రూ.1,01,116లు, గోదానం నిమిత్తం రూ. 75,510లు అందజేసి రసీదును స్వీకరించారు. దాతను దేవస్థానం అధికారులు ఘనంగా సత్కరించారు.

# గ్రామానికి ఆదర్శంగా నిలిచిన యువత

- యువకులను అభినందించిన గ్రామస్తులు



**బూర్గంపహాడ్, అక్టోబరు 5, (ప్రజా జ్యోతి):** యువకులు చేయి, చేయి కలిపి గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి ఆదర్శంగా నిలిచారు.బూర్గంపహాడ్ మండల పరిదిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన పలువురు యువకులు హైదారాబాద్, బెంగుళూరు, చెన్నై పట్టణాలలో ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.కాగా దసరా పండుగ కావడంతో ఇళ్లకు వచ్చారు.గ్రామానికి చేరుకున్న స్నేహితులతో కలిసి నవరాత్రులు ఆనందంగా గడిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. తరచుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండడంతో చలించిపోయారు. ఆదివారం యువకులు స్వంత ఖర్చులతో మోరం పల్లిబంజర ప్రధాన సెంటర్ నుంచి మండల కేంద్రమైన బూర్గంపాడు వైపునకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను విటమిన్స్తో నింపారు. అధికారులు, రాజకీయ నాయకుల తీరుకు నిదర్శనంగా యువకులు చేపట్టిన కార్యక్రమానికి పలువురు ప్రశంసలు కురిపించారు. గుంతలను పూడ్చి ఆదర్శంగా నిలిచిన యువకులను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో మూల నరేందర్రెడ్డి, కామిరెడ్డి కార్తీకరెడ్డి, బొబ్బాల శ్రీనివాసరెడ్డి, గుంటకల్లు వివేక్, అరిపినేని సాయి నరేంద్ర,మేడం వెంకట్రామిరెడ్డి, గుజ్జు రాజమహేందర్రెడ్డి, కామిరెడ్డి రాజశేఖర్రెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొ న్నారు.

# జర్నలిస్ట్ సూరి ఆత్మహత్యాయత్నం

- పోలీసులు కేసు నమోదు చేయలేదని మనోవేదన
- సిపిఐ నేత బెదిరింపులే కారణంగా వెల్లడించిన సూరి



**కొత్తగూడెం, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** ఒక తెలుగు దినపత్రికలో కొత్తగూడెం టౌన్ కు విలేకరిగా పనిచేస్తున్న చదలవాడ సూరి ఆదివారం ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాగా వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్ లో ఉంచారు. ఆత్మహత్యాయత్నం పై సూరి ని వివరణ అడగగా..కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంట పై వార్తను సెప్టెంబర్ 30న వార్త రాయగ స్థానిక సిపిఐ జిల్లా నేత ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని, ఆ నేతపై స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోవట్లేదని, అనంతరం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన సంఘటనను వారికి వివరించానని. అనంతరం కొత్తగూడెం వచ్చాక పోలీస్ స్టేషన్ కు వెళ్లగా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని మనోవేదన చెంది ఎలకల మందు తాగి ఆత్మహత్యా చేసుకోవాలని అనుకున్నాను సూరి వెల్లడించాడు.

# ఉచిత డోర్ డెలివరీ ఉన్న పైసలు వసూల్...!

- హోటళ్లలకు ఇష్టానుసారంగా డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా
- విధులను గాలికి వదిలేసిన సివిల్ సప్లై అధికారులు







**కొత్తగూడెం, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్యాస్ కొనుగోలు చేయాలంటే వామ్మో అనాల్సిందే. అసలే ఆకాశానికి ఎక్కిన గ్యాస్ ధర, గ్యాస్ ధర పెరిగితే ఏంటి, తగ్గితే మాకేంటి అనుకున్నారేమో, అందుకే అక్రమ సంపాదనే ధ్యేయంగా గ్యాస్ ఏజెన్సీలు బరితెగిస్తున్నాయి. గ్యాస్ వినియోదారులు గ్యాస్ సిలిండర్ కోసం ఆన్లైన్లో గ్యాస్ బుక్ చేసుకోగానే బిల్ మీద ఉన్న ధర మాత్రమే తీసుకొని వినియోగదారుడికి సిలిండర్ డోర్ డెలివరీ చేయాలి కానీ గ్యాస్ ఏజెన్సీలు దానికి విరుద్ధంగా వారి సొంత ట్రాలీ ఆటోలు ఏర్పాటు చేసుకోకుండా, వారికి ఉచితంగా సర్వే చేసే వారిని తీసుకొని బిల్ అమౌంట్ సంబంధిత గ్యాస్ వారు తీసుకుంటారు. ఈ ట్రాలీ ద్వారా సప్లై చేసే డెలివరీ వారు వినియోగదారుల నుంచి వారిష్టానుసారంగా నచ్చిన రేటు తీసుకొని వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారు. నిబంధన మేరకు గ్యాస్ ఏజెన్సీ వారే సప్లై చేయాల్సి ఉంటుంది. డెలివరీ బాయ్స్ కి వినియోదారులు సహకరించకపోతే వారికి గ్యాస్ కష్టాలు తప్పవు. హోటల్స్, టిఫిన్ సెంటర్స్, టి స్టాల్స్ వద్ద కమర్షియల్ సిలిండర్లు వినియోగించాలి కానీ కొత్తగూడెం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటికి వాడవలసిన డొమెస్టిక్ సిలిండర్లు హోటల్లు, టిఫిన్ సెంటర్స్ వద్ద ప్రత్యక్షమవుతున్నాయి. కారణం గ్యాస్ డీలర్లు వారి ఇష్టానుసారంగా అక్రమంగా గ్యాస్ సిలిండర్లు బ్లాక్ లో అందించడమే, అసలు డొమెస్టిక్ సిలిండర్లు రోడ్డుపైకి ఎలా వస్తున్నాయి. ఒక విధంగా చూస్తే ప్రభుత్వ ఆదాయాన్ని గండి పడ్డట్టే అయిన సివిల్ సప్లై అధికారులు వారి విధులను గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నారా అనే సందేహం మనకు తప్పదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వినియోగదారులు కోరుతున్నారు.